www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 3 అక్టోబర్ 2023
5
చిత్తూరు



పంట పొలాలపై ఏనుగుల దాడి

- భారీగా నష్టపోయిన రైతులు - ఆందోళనలో గ్రామస్తులు

ప్రజాశక్తి- సోమల : మండలం ఇరికిపెంట పంచాయతీ చెన్నపట్నం చెరువు మొరవ వద్ద ఏనుగుల మంద పంట పొలాలపై ఆదివారం రాత్రి దాడిచేసి తీవ్రంగా నష్టపరిచాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. సోమవారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటలను ఏనుగులు ధ్వంసం చేయడం గమనించారు. దాదాపు నాలుగు నుండి ఆరు ఏనుగులు గుంపుగా పంటపై దాడి చేసినట్టుగా రైతులు చెబుతున్నారు. దాడిలో అరటి తోటలతోపాటు టమోటా, బీన్స్ చెరకుపంటలపై ఏనుగులు దాడిచేసి నష్టపరిచినట్టు రైతులు తెలిపారు. ఏనుగులు పంటలు నాశనం చేసిన ప్రాంతానికి పార్వతినగర్ (బంగ్లా) కూతవేటు దూరంలోనే ఉండటంతో ఏనుగులు ఎప్పుడు ఎటు నుంచి గ్రామం వైపు వస్తాయేమోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పార్వతి నగర్ రాజన్న, పాపయ్య నాయుడుకు చెందిన పంట పొలాలపై ఏనుగులు దాడి చేయగా రెండు లక్షలకు పైగా పంట నష్టం కలిగినట్లు రైతులు తెలిపారు. ఈ ప్రాంతంలో తరచూ పంటలపై ఏనుగులు దాడి చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఏనుగులు ఇటువైపు రాకుండా అటవీశాఖ సిబ్బంది చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఏనుగులు దాడి చేసిన అరటి తోటను చూపుతున్న రైతు

నేడు మాపాక్షిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ఏర్పాట్లపై సమీక్షించిన కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో మంగళవారం మాపాక్షిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం జరుగుతుందని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ చెప్పారు. 11, 12, 13, 14, 16 వార్డులకు సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మాపాక్షి అర్బన్ ఆరోగ్య కేంద్రం పరిధిలో మాపాక్షి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో జరుగుతుందన్నారు. వైద్యశిబిరానికి సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు చెప్పారు. వైద్య శిబిరంలో జనరల్ ఫిజీషియన్, జనరల్ మెడిసిన్, చిన్నపిల్లలు, ఓబీజీ, ఆర్థోపెడిక్, డెంటల్, ఈఎన్టీ, న్యూరో, గుండె, జరియాట్రిక్ (వద్ధాప్య సంబంధిత సమస్యలు) చెందిన వైద్య నిపుణులు వైద్యసేవలు అందించనున్నట్లు చెప్పారు. వైద్యశిబిరం ఏర్పాట్లు, నిర్వహణపై అధికారులతో సోమవారం కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఎవరెవరికి నిర్దేశించిన విధులను వారు పక్కాగా నిర్వహించాలని మార్గ నిర్దేశం చేశారు. శిబిరానికి హాజరయ్యే ప్రజలకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. వైద్య సేవలను వీలైనంత ఎక్కువ మంది సద్వినియోగం చేసుకోనేలా వార్డులో అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, సీఎంఎం గోపి, అధికారులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

కెవిపిఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



కెవిపిఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి అన్నూరి ఈశ్వర్

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పట్టణంలో కెవిపిఎస్ 25వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అన్నూరి ఈశ్వర్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మగౌరవం సమానత్వం కులనిర్మూలన లక్ష్యసాధనకై 1998 అక్టోబర్ 2వ తేదీ ఉమ్మడి రాష్ట్రాల ఆధ్వర్యంలో ఏర్పాటు అయిన కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం దళితులు పేదల పక్షాన ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా ఎదుగుదల కోసం అనేక ఉద్యమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈఉద్యమాల్లో భాగంగా జస్టిస్ పున్నయ్య కమిషన్ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు డప్పు కళాకారుల పెన్షన్ ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కావాలని కాటికాపర్లు నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని దళితులతో లాక్కున్న భూములు అగ్రకుల పెత్తందారుల నుండి విముక్తి చేసి దళితులకు పేదలకు పంచిన చరిత్ర కెవిపిఎస్ సంఘానికి ఉందన్నారు కుశలవ సంస్థ ఆధీనంలో ఉన్నటువంటి భూములను ఆక్రమించి అరకు పట్టి సాగు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి ఈ భూములను పేదలకు ఇచ్చే అంతవరకు సహాయ సహకారాలు అందించాలని కెవిపిఎస్ కోరుకుంటుందన్నారు. కెవిపిఎస్ సీనియర్ నాయకులు ఓబుల్ రాజు, చిరంజీవమ్మ, మండల కార్యదర్శి పాకాల సుబ్రహ్మణ్యం, గుర్రం సుబ్రమణ్యం, అధ్యక్షులు సోమశేఖర్, మండల కమిటీ గణేష్ పాల్గొన్నారు.

పకడ్బందీగా ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణ

ఏర్పాట్లపై జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్ సమీక్ష



నిర్వహణ కోసం జిల్లా అధికారులతో మాట్లాడుతున్న డిఆర్ఓ

ప్రజాశక్తి- చిత్తూరు: జిల్లా కేంద్రంలో ఈనెల 3వ తేదీన నిర్వహించే ఏపీపీఎస్సీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్ఓ ఎన్.రాజశేఖర్ సంబంధింత అధికారులను ఆదేశించారు. సోమవారం డిఆర్ఓ ఛాంబర్లో ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ జిల్లా ప్రొబెషన్ ఆఫీసర్ గ్రేడ్ 2, టెక్నికల్ అసిస్టెంట్, అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫిషరీస్, జూనియర్ ట్రాన్స్లేటర్ ఇన్ తెలుగు, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్, టెక్నికల్ అసిస్టెంట్, ఫుడ్సేఫ్టీ ఆఫీసర్, గ్రూప్ 4 సర్వీసెస్, సివిల్ అసిస్టెంట్ సర్జెన్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న 152 మంది అభ్యర్ధులకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా కేంద్రంకు సమీపంలో ఆర్వీఎస్ నగర్ వద్ద ఉన్న ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ బేస్డ్ విధానంలో పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షకేంద్రానికి చేరుకోవాలని చెప్పారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్ష కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్ష కేంద్రం వద్ద 144సెక్షన్ విధించాలని, మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించొద్దని ఆయా అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాన్స్కో అధికారికి తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసే అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. సమావేశంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్ వాసుదేవన్, ఏపీపీఎస్సీ నుంచి నందగోపాల్, వన్ టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి, లైజన్ ఆఫీసర్ ధనంజయలు పాల్గొన్నారు.

స్కూల్లా.. ఫంక్షన్ హాలా..?

- పాఠశాలను పాకశాలగా మార్చిన హెచ్ఎం
- ప్రైవేటు కార్యక్రమాల కోసం అనుమతిచ్చిన వైనం



ప్రభుత్వ పాఠశాలలో విందులు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- శాంతిపురం: విద్యాబుద్ధులు నేర్పేందుకు ఏర్పాటు చేసిన ఉన్నత పాఠశాలను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫంక్షన్ హాల్గా మార్చేసిన ఘటన మండల పరిధిలోని రాళ్ళబూదుగూరులో వెలుగు చూసింది. రాళ్ళబుదుగూరు ఉన్నత పాఠశాలను ఆపాఠశాల ప్రధానోపాధ్యాయుడు, విద్యా కమిటీ అధ్యక్షుడు కలిసి ఓప్రైవేటు కార్యక్రమం కోసం అనుమతివ్వడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఇంతవరకు చరిత్రలో పాఠశాలను ప్రైవేటు కార్యక్రమాల కోసం ఉపయోగించిన దాఖలాలు మండలంలో ఎక్కడా లేదు. కానీ రాళ్లబూదుగూరులో ఇటీవల రాజకీయ పార్టీ నాయకుడి మెప్పు పొందడం కోసం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిబంధనలను ఉల్లంఘించి ఏకంగా పాఠశాలనే కళ్యాణ మండపంగా మార్చేశారు. దీనిపై జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అంతేకాదు నిబంధనల ప్రకారం కనీస విద్యార్హతలు ఉన్న వ్యక్తిని పాఠశాలలో విద్యాకమిటీ అధ్యక్షులుగా నియమించాల్సి ఉంది. కానీ నిబంధనలను తుంగలో తొక్కి పాఠశాల విద్యాకమిటీ అధ్యక్షులుగా ఇటువంటి కనీస విద్యార్హత లేని వ్యక్తిని ఎన్నుకోవడంపై మండలంలోని అధికారులు నేతలు ప్రజలు విమర్శిస్తున్నారు.

'స్వచ్ఛ చిత్తూరు'కి కలిసికట్టుగా పనిచేద్దాం..

కలెక్టర్ సగిలి షన్మోహన్



స్వచ్ఛ చిత్తూరు ర్యాలీలో విద్యార్థులతో జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్వచ్ఛ చిత్తూరు కోసం అందరం కలిసికట్టుగా పనిచేద్దామని కలెక్టర్ సగిలి షన్మోహన్ పిలుపునిచ్చారు. గాంధీ జయంతి, స్వచ్ఛత హీ సేవా ముగింపు పురస్కరించుకొని సోమవారం గాంధీ విగ్రహకూడలిలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ ఎస్.అముద, కమిషనర్ డాక్టర్ జె.అరుణ పాల్గొన్నారు. స్వచ్ఛతా హీ సేవా ముగింపు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, డ్వాక్రా మహిళలకు నిర్వహించిన రంగోలి పోటీలను తిలకించారు. పరిశుభ్రతా కార్యక్రమాల్లో పాల్గొన్న పారిశుద్ధ్య కార్మికులు, విద్యార్థులు, స్వయం సహాయక మహిళలను అభినందించారు. పరిశుభ్రత కార్యక్రమాలు నిరంతరం కొనసాగానాలన్నారు. నగర కమిషనర్ డాక్టర్ అరుణ మాట్లాడుతూ నగరంలో గడిచిన రెండు వారాలుగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా విస్తృత కార్యక్రమాలు చేపట్టి ప్రజా ప్రతినిధులు, ప్రజలు, యువతను భాగస్వాములను చేసి అవగాహన కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో రేణుక, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, నగర పాలక అధికారులు పాల్గొన్నారు.

గాంధీజీ అడుగుజాడల్లో నడవాలి : కలెక్టర్



గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ షన్మోహన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా చిత్తూరు జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్, ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, నగర మేయర్ అముద, జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ రమ్య, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, కమిషనర్ అరుణ, ఆర్‌డిఓ రేణుకా, జడ్పీ మహిళా స్థాయి సంఘ చైర్మన్ భారతి తదితరులు ఘనంగా నివాళులు అర్పించారు. జడ్పీ చైర్మన్, కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ పాత్ర ఎంతో విలువైనదని ఆయన అందించిన సేవలను మరువలేనివి భారతీయులుగా మనమందరం మననం చేసుకోవాలన్నారు.

చిత్తూరు సబ్ జైలులో.. చేసిన తప్పిదాలను సరిదిద్దుకునే అవకాశం ఉంటుందని, న్యాయ సేవకు కూడా నోచుకోలేని పలువురికి సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాల మేరకు న్యాయసేవలు కూడా ఉచితంగా అందించడం జరుగుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఐ.కరుణకుమార్ పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా జిల్లా జైలులో ఖైదీల దినోత్సవం జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ ఎస్.షన్మోహన్, అడిషనల్ ఎస్పీ సుధాకర్ పాల్గొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను పంచిపెట్టారు.

నగరపాలక కార్యాలయంలో.. నగరపాలక కార్యాలయంలో ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహానికి మేయర్ ఎస్.అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, సహాయ కమిషనర్ గోవర్ధన్‌లు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

నగరి: మునిసిపల్ కార్యాలయం వద్ద మునిసిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, కమిషనర్ వెంకట్రామిరెడ్డి కార్యాలయ ఆవరణలో మహాత్మాగాంధీ చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పూజలు చేశారు. చంద్రారెడ్డి, కౌన్సిలర్లు దయానిధి, గోపాల్‌రెడ్డి, ఇంద్రయ్య, వీకే.శ్రీనివాసన్, మేనేజర్ శేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: జాతిపితను స్మరించుకోవడం మన అందరి బాధ్యత అని ఎంపీపీ అమరావతి అన్నారు. సోమవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని మండల కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలేసి పూజలు చేసి నివాళు లర్పించారు. ఇన్చార్జి తహాశీల్దార్ అనిల్ కుమార్, ఇంచార్జ్ ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి, ఎంఈఓ నాగేశ్వరరావు, సిఐ నాగరాజు రావు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. మండల వైస్ ఎంపీపీ హరిబాబు, గంగాధర సర్పంచ్ సుబ్రమణ్యం, మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సుధాకర్, సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

టిడిపి దీక్షలో.. టిడిపి రిలే నిరాహార దీక్షశిబిరంలో గాంధీ జయంతి వేడుకలను టిడిపి నేతలు ఘనంగా నిర్వహించారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో దౌర్జన్యాలు, కుట్రలు, దాడులు, అక్రమ అరెస్టులకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారని ధ్వజమెత్తారు. జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి హరిబాబు నాయుడు, జిల్లా టిడిపి యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, రాష్ట్ర టిడిపి సాంస్కతిక విభాగం అధికార ప్రతినిధి ముని చంద్రారెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు స్వామిదాస్ పాల్గొన్నారు.

సోమల : మండల కేంద్రమైన సోమలలోని బాపూజీ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలో ఆర్యవైశ్య సంఘం, సాయి చరణ్ ఇంగ్లీష్ మీడియం సిబ్బంది దాదాపు 500మంది విద్యార్థులు జాతీయ జెండాలు చేత పట్టి మహాత్ముడి చిత్రపటాన్ని పురవీధులలో ఊరేగించారు.

పలమనేరు: మహాత్మా గాంధీ 154వ జయంతి, లాల్ బహుదూర్ శాస్త్రి 119వ జయంతిని పురస్కరించుకొని పలమనేరు పరిరక్షణ సమితి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పెన్షనర్ల సంఘం, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ పవిత్ర మురళి కృష్ణ, అన్ని ప్రభుత్వ కార్యాలయంలో బాపూజీ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.



నగరిలో..

కార్వేటినగరం: మండలంలోని కత్తెరపల్లి సచివాలయంలో సోమవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని గాంధీ చిత్రపటానికి సర్పంచులు నవీన గుణవతి లోకనాథం నాయుడు పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఉపసర్పంచ్ కుప్పయ్య, అర్జునయ్య, కుప్పారెడ్డి పాల్గొన్నారు.



బంగారుపాళ్యంలో..



చిత్తూరులో గాంధీ విగ్రహానికి జర్నలిస్టుల వినతి

సోమవారం నగరంలోని గాంధీ విగ్రహం వద్ద జర్నలిస్టులు పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రెస్‌క్లబ్ కోశాధికారి పవన్ కుమార్, ఉపాధ్యక్షులు మహేష్, శివ, రమేష్ పాల్గొన్నారు.

కన్నన్ మైదానంలో శ్రమదానం




స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం చిత్తూరు నగరంలోని బిఎస్.కన్నన్ ప్రభుత్వ కళాశాల మైదానంలో వాకర్స్ సభ్యులు శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా మైదానంలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించడంతోపాటు పిచ్చి మొక్కలను తొలగించారు. అలాగే అక్కడక్కడ ఉన్న ప్లాస్టిక్ కవర్లను ఇతర చెత్తను తొలగించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కే.గోపీనాథ్, వాకర్స్ సభ్యులు సయ్యద్ ఇస్మాయిల్, చంద్రశేఖర్, రాజేంద్రనాథ్, బాలసుబ్రమణ్యం, రసూల్ బాష, మురళి, బాలమురుగన్, చంద్రశేఖర్‌స్వామి, నాగరాజు, యాగమరెడ్డి, యుగంధర్, ధనలక్ష్మి పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టిన జర్నలిస్టులు

చిత్తూరుఅర్బన్: జర్నలిస్టుల సంక్షేమానికి భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని జిల్లా కన్వీనర్, చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఎం.లోకనాథన్, చిత్తూరు ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి కెఎం. అశోక్ కుమార్ కోరారు.



కలెక్టరేట్ ఎదుట గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నిరసన తెలుపుతున్న డెయిరీ కార్మికులు



గంగాధర నెల్లూరులో..

అటవీశాఖ క్లియరెన్స్ ఇస్తేనే.. 2 గంటల తరువాత

చిన్న పిల్లలకు నడక దారిలో అనుమతి

తిరుమలలో క్యూలైన్లు పరిశీలించిన టీటీడీ చైర్మన్ భూమన



ప్రజాశక్తి- తిరుమల: అలిపిరి నుంచి తిరుమలకు నడచి వచ్చే మార్గంలో వన్య మగాల నుండి ఎలాంటి ముప్పు లేదని అటవీశాఖ అధికారులు ధవీకరిస్తేనే 12 ఏళ్ళ లోపు పిల్లల విషయంలో ఆంక్షలు సడలిస్తామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి స్పష్టం చేశారు. భక్తుల భద్రతే తమకు ముఖ్యమని ఆయన చెప్పారు. తిరుమలలో భక్తుల రద్దీ నేపథ్యంలో సోమవారం చైర్మన్ క్యూలైన్లను పరిశీలించారు. భక్తులకు ఆహారం, తాగునీరు, కాఫీ, టీ, మజ్జిగ అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి చిన్న ఇబ్బంది కలగకుండా మరింత కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. గోగర్భం సర్కిల్ నుండి కష్ణతేజ సర్కిల్ వరకు క్యూ లైన్లను పరిశీలించారు. అనంతరం చైర్మన్ కరుణాకర రెడ్డి మీడియాతో మాట్లాడారు. పెరటాశి మాసం, సెలవుల కారణంగా గత నాలుగు రోజులుగా తిరుమలలో భక్తుల సంఖ్య అనూహ్యంగా పెరిగిందన్నారు. క్యూలైన్లు 4 నుండి 5 కిలోమీటర్ల దూరం వెళ్లాయని, ఇలాంటి భక్తులకు త్వరిత గతిన స్వామి వారి దర్శనం చేయించాలనే సంకల్పంతో విఐపి బ్రేక్, సుపథం, స్లాటెడ్ దర్శనం టోకెన్ల జారీ కూడా రద్దు చేసినట్లు చైర్మన్ చెప్పారు. క్యూలైన్లలో ఉండే భక్తులు ఎక్కడా అసహనానికి లోను కాకుండా అవసరమైన తగిన వసతులు కల్పించామని చెప్పారు. అక్టోబరు 15 నుండి జరిగే నవరాత్రి బ్రహ్మోత్సవాలకు పెద్దసంఖ్యలో భక్తులు హాజరవుతారనే అంచనాతో అవసరమైన ఏర్పాట్లు, జాగ్రత్తలు తీసుకుంటుంటున్నామని తెలిపారు.

అధికారుల పనితీరు బ్రహ్మాండం

విపరీత మైన భక్తుల రద్దీ ఉండటంతో ఈవో, జేఈవో, సివిఎస్వో, ఆరోగ్యం ఇతర అధికారులందరూ ప్రతిక్షణం అప్రమత్తంగా ఉంటూ క్యూలైన్లు పరిశీలిస్తూ బ్రహ్మాండంగా పనిచేస్తున్నారని చైర్మన్ చెప్పారు. తిరుమలకు భక్తులు పోటెత్తడంతో వీరు ప్రత్యక్షంగా ఏర్పాట్లు పరిశీలిస్తూ భక్తులకు చిన్న ఇబ్బంది కూడా కలక్కుండా పని చేస్తున్నారని చైర్మన్ అభినందించారు. కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, సివిఎస్వో నరసింహ కిషోర్, ఆరోగ్యాధికారి డాక్టర్ శ్రీదేవి, డిఎఫ్వో శ్రీనివాసులు, వీజీవోలు బాలిరెడ్డి, గిరిధర్, డిఎస్పీ భాస్కర్ రెడ్డి, డిప్యూటీ ఈవో రాజేంద్ర, సిఐలు జగన్మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ ఉన్నారు.

'చిత్తూరు నగరాన్ని అభివృద్ధి చేయండి'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో తాండవ మూర్తి, అధ్యక్షతన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వంద సంవత్సరాల చిత్తూరు నగరం అభివద్ధికి ఆమడ దూరంలో ఉందని తిరుపతి, అన్నమయ్య జిల్లాలుగా విడిపోయిన తర్వాత మరింత బలహీన పడిందని అన్నారు. పాలకులు చిత్తూరు నగర సమస్యలను త్వరితనగతిన పరిష్కరించి నగరాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి శివకుమార్, సభ్యులు సత్య, శోభారాణి, అజ్మతుల్లా, మురళి, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోర్టు ఆవరణలో పారిశుధ్య పనులు చేపట్టిన జడ్జి, కోర్టు సిబ్బంది

జె సి జె కోర్టు ఆవరణలో స్వచ్ఛతాహి

ప్రజాశక్తి -పలమనేరు: పట్టణ సమీపంలోని జూనియర్ సివిల్ కోర్ట్ ఆవరణలో జడ్జి వి రవి ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆ మేరకు ముందుగా ర్యాలీని చేపట్టి అనంతరం కోర్టు ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాలను జడ్జి, పలమనేరు పరిరక్షణ సమితి సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, మునిసిపల్ కార్మికులు కలసి తొలగించి శుభ్రపరిచారు. అనంతరం కోర్టు చాంబర్లోని బూజును పూర్తిగా తొలగించి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా జడ్జ్ వి రవి మాట్లాడుతూ హైకోర్టు సర్క్యులర్ ప్రకారం స్వచ్ఛతాహి కార్యక్రమాన్ని కోర్టు ఆవరణలో చేపట్టి శుభ్రపరచామన్నారు. ఈ కార్యక్రమంతో పరిసరాలు పరిశుభ్రంగా మారాయన్నారు. ఈ సందర్భంగా హైకోర్టు వారికి తన వంతు అభినందనలు తెలిపారు.



ఫోర్జరీ సంతకాలతో భూమిని కాజేసే ప్రయత్నం

బాధితుల ఆవేదన

ప్రజాశక్తి -గంగవరం: తమ భూమిని ఫోర్జరీ సంతకాలతో కాజేసే ప్రయత్నం చేసినందుకు అడిగితే తమపైకే దౌర్జన్యానికి పాల్పడుతున్నారని గంగవరం మండలం దిగువ వేమనపల్లి గ్రామానికి చెందిన బాధితులు శంకరమ్మ, వెంకటమ్మ, మునెమ్మ సోమవారం జరిగిన అన్యాయంపై ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల కథనం మేరకు..సర్వేనెంబర్ 881/1 లో 1,4 సెంట్లు 1030/1లో 4.96 ఎకరాలు తమ మామ కంచన్న పై రెవెన్యూ రికార్డులలో నమోదైన భూమిలో అదే గ్రామానికి చెందిన లేట్ వెంకటరమణ భార్య మంగమ్మ ఫోర్జరీ సంతకాలతో తమ భూమిని 3. 75 సెంట్లు ఆన్లైన్ నమోదు చేసుకున్నారని ఈ విషయాన్ని గమనించిన తాము గంగవరం తహశీల్దారు కి తెలియపరచగా ఆయన పరిశీలించి పొరపాటు జరిగిందని ఆన్లైన్ వారి పేరును రద్దుచేసి తమ పేరు నమోదు చేసి న్యాయం చేశారన్నారు. అయినప్పటికీ మంగమ్మ కుటుంబీకులు ప్రతిరోజు తమ పైకి దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రికార్డులు సక్రమంగా ఉన్నందున వల్ల న్యాయస్థానం ద్వారా ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నామని అయినా వారి దౌర్జన్యాలు ఆగలేదన్నారు. మంగమ్మ కుటుంబీకులు తమను చంపేస్తారోనని భయంతో గంగవరం పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. వారి నుండి తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని సంబంధిత అధికారులు స్పందించి రెవెన్యూ రికార్డులను పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరం



ప్రజాశక్తి -గుడిపల్లి: ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం గుడుపల్లి మండలం చిన్న గొల్లపల్లి పంచాయతీ పెద్దగొల్లపల్లి గ్రామంలో సుమారు 130 మందికి ఉచితంగా వైద్యం చేస్తూ అలాగే మెడిసిన్ లు సరఫరా చేశారు. పేద ప్రజలకు ఉచితంగా వైద్యం చేయాలనే ఉద్దేశంతో ఇలాంటి ఒక గొప్ప కార్యక్రమాన్ని ప్రారంభించిన చంద్రబాబు సతీమణి భువనేశ్వరికి ధన్యవాదాలు తెలుపుకుంటూ, గ్రామానికి విచ్చేసిన వైద్య బృందానికి ఆ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు . వైద్యానికి వచ్చిన రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మంచినీరు అన్నదానం గ్రామస్తుల సహాయంతో ఏర్పాటు చేశారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహతి ఫౌండేషన్ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు ఇందులో భాగంగా ఓటీకి 95 మంది హాజరు కాగా వారిని డాక్టర్లు పరీక్షించి 11 మంది ఆపరేషన్ సెలెక్ట్ అయినట్లు గుర్తించారు వారిని కుప్పం పిఇఎస్ హాస్పిటల్ లో ఉచితంగా కంటి ఆపరేషన్ నిర్వహించి వారిని ఉచితంగా వారి ఇంటి వద్దకు చేస్తున్నట్లు మహతి ఫౌండేషన్ సహాయక మేనేజర్ తెలిపారు.

వైసిపి మండల అధ్యక్షుడికి సన్మానం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం కీళ్ళపూడి గ్రామంలోని గజ సింగరాజపురం గ్రామస్తులు వైసిపి మండల అధ్యక్షులుగా ఎన్నికైన కె చలపతి రాజును ఘనంగా సన్మానించారు. చలపతి రాజు మాట్లాడుతూ ఈ గ్రామంలో వైసిపిపై ఎక్కువ మంది మక్కువ చూపడం చాలా సంతోషం అన్నారు. ఈ గ్రామంలో సోమవారం పాండియన్ ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమం గ్రామం మొత్తం కలిసి వచ్చి తనను సన్మానించడం చాలా సంతోషంగా వుందన్నారు. గ్రామానికి కావలసిన అవసరాలను తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి గ్రామ కార్యదర్శి భాస్కర్ నాయుడు, ఎంపీటీసీ రమేష్ రాజు, మోహన్, సుబ్రహ్మణ్యం, త్యాగరాజులు, మోహన్ రెడ్డి, బాబు,గోపి ఎలుమలై, రత్నం, నాగరాజు పాల్గొన్నారు.

ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర కార్యదర్శిగా అశోక్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న తిరుపతి అర్బన్ డిప్యూటీ తాహశీల్దార్ మిట్టపల్లి అశోక్ రెడ్డి ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపిక అయ్యారు.ఈ మేరకు విజయవాడలో రెండు రోజులపాటు జరిగిన రాష్ట్రస్థాయి రెవెన్యూ ఉద్యోగుల సమావేశంలో రాష్ట్ర కార్యదర్శిగా అశోక్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. అసోసియేషన్కు నూతన కార్యదర్శిగా ఎన్నికైన అశోక్ రెడ్డిని రెవెన్యూ శాఖ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్ ప్రత్యేకంగా అభినందించి జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగులు అశోక్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపారు.

దళిత గిరిజన మహిళలపై దాడులు అడ్డుకోవాలి..

- నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి
- భారత రాజ్యాంగాన్ని రక్షించాలి
- వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల పిలుపు

ప్రజాశక్తి -పలమనేరు: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం చిత్తూరు జిల్లా కమిటీ సమావేశం పట్టణం లోని సిఐటియు కార్యాలయం లో సోమవారం జిల్లా అధ్యక్షురాలు చిరంజీవమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు హాజర్ రాష్ట్ర కర్తవ్యాలను, రాజకీయ పరిస్థితులను వివరించారు. ఈ సమావేశంలో నాలుగు అంశాల పైన చర్చించి కర్తవ్యాలను నిర్ణయించారు. కర్తవ్యాలను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హంగేరి ఓబుల్ రాజు కమిటీ ముందు ప్రతిపాదించారు వాటిని ఆమోదం పొందారు. దేశంలో బిజెపి నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, దళితులపై, క్రిస్టియన్, ముస్లిం మైనార్టీలపై మహిళలపై దాడులు రోజురోజుకూ పెరిగిపోయి ఈ వర్గాలకు దేశంలో రక్షణ లేకుండా పోయిందన్నారు. దీనికి నిరసనగా దేశవ్యాప్తంగా చలో ఢిల్లీ కార్యక్రమం డిసెంబర్ 4న చేపట్టాలని నిర్ణయించారన్నారు. నరేంద్ర మోడీ విధానాలకు వ్యతిరేకంగా ప్రతి గ్రామంలోనూ సంతకాల సేకరణ చేయాలని నిర్ణయించారు. నరేంద్ర మోడీ విధానాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్న రాష్ట్రంలో వైసిపి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కూడా ఈ ప్రజా వ్యతిరేక విధానాల్లో పాలుపంచుకుంటున్న నేపథ్యంలో ఈ రాష్ట్ర ప్రభుత్వం కూడా రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పించుకోవాలని ఉంటుందని హెచ్చరించారు. అంతే కాకుండా ఉపాధి హామీ నిధులు దారి మళ్లించి ఉపాధి కూలీల కడుపు కొడుతున్న జగన్మోహన్ రెడ్డి వెంటనే ఉపాధి బిల్లుల చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్రలు చేస్తోందని అందుకు నిదర్శనం బడ్జెట్లో కేటాయింపులు తగ్గించడం మనం గమనించాలన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని కాపాడేందుకు డిసెంబర్ 4న నిర్వహించనున్న 'చలో ఢిల్లీ'లో పెద్ద ఎత్తున ఉపాధి కూలీలు పాల్గొని తమ నిరసన గళాన్ని నరేంద్ర మోడీ గూబ గుయ్యిమనేలా నినదించాలని పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో, దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతోందని రాష్ట్ర చరిత్రలో ఇన్ని సార్లు 144 సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు చేసిన ఏకైక ప్రభుత్వం వైసిపి జగన్మోహన్ రెడ్డి దని అని తెలిపారు. డిసెంబర్ 4న చలో ఢిల్లీ కార్యక్రమానికి గ్రామాల నుండి ప్రజలను చైతన్యపరిచి డిసెంబర్ 4న ఢిల్లీ నడిరోడ్డు పైన లక్షలాదిమంది ప్రజలతో మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటానికి 2024 పార్లమెంట్ ఎన్నికల్లో నరేంద్ర మోడీని జగన్మోహన్ రెడ్డిని గద్దె దించేందుకు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో కుప్పం, గుడిపల్లి, శాంతిపురం, రామకుప్పం, వీకోట, బైరెడ్డిపల్లి, పలమనేరు, గంగవరం, నింద్ర, పెద్దపంజాణి, తదితర పది మండలాల నుండి మండల నాయకత్వం జలపతి వీరభద్రప్ప, వెంకటేష్, ఉన్నామలై, సుబ్రహ్మణ్యం, కొండప్ప, పాకాల సుబ్రహ్మణ్యం, ఈశ్వరయ్య, మురుగేష్, బాలసుబ్రమణ్యం , వేనప్ప, గణేష, సోమశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

అభివృద్ధే లక్ష్యంగా జగన్మోహన్ రెడ్డి పాలన

- డిప్యూటీ సిఎం నారాయణ స్వామి

ప్రజాశక్తి - కార్వేటినగరం : అభివృద్ధే లక్ష్యంగా జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని డిప్యూటీ సిఎం నారాయణ స్వామి అన్నారు. గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో సోమవారం ఉదయం అల్లాగుంట, అన్నూరు, ఇందిరమ్మ ఇళ్ళు, చౌటూరు, కృష్ణ సముద్రం దళితవాడ, అన్నూరు, సెట్టిగుంట ఏనాది కాలనీ ఉప్పరపల్లి గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుందర్ రాజ్ ఆధ్వర్యంలో అల్లాగుంటలో మంత్రి నారాయణస్వామి పై పూల వర్షం కురిపించారు. అల్లగుంటలో జాతీయ రహదారి నుండి సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. వెంటనే మాంత్రి స్పందిస్తూ సిసి రోడ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కృష్ణ సముద్రంలో 78 మందికి ఇంటి పట్టాలు మంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు పట్టలు పంపిణీ చేశారు. గత 30 సంవత్సరాలు ఇంటి పట్టాల కోసం పోరాడుతూ ఉంటే డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో పట్టాలు మందులు కావడం చాలా సంతోషంగా ఉందని సర్పంచ్ సుందర్ రాజ్, వైసిపి నాయకులు ఏకాంబరం,హమీద్ పేర్కొన్నారు. నేటికీ కల నెరవేరిందని గ్రామస్తులు సంతోషం



వ్యక్తం చేశారు. అల్లగుంట లో సర్పంచ్ సుందర్ రాజ్ ఆధ్వర్యంలో క్రేన్ తో గజమాల వేసి స్వాగతం పలికారు. అదేవిధంగా కష్టసముద్రంలో ఏకం వరం కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో గజమాలవేసి ఘనంగా సన్మానించారు.

సచివాలయం.. రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించిన మంత్రి

అన్నూరు గ్రామంలో 40 లక్షలతో నూతన సచివాలయం, 21 లక్షలతో రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి నారాయణస్వామి, మాజీ సర్పంచ్ లోకనాథరెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అధికారులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లతబాలాజీ, మండల కన్వీనర్ శేఖర్ రాజు, సింగిల్ విండో అధ్యక్షులు లోకనాథ్ రెడ్డి, మాజీ మండల కన్వీనర్ ధనంజయవర్మ, మండల కో ఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్ రెడ్డి, తుడా మాజీ ప్లానింగ్ అధికారి కృష్ణారెడ్డి, జె సి ఎస్ కన్వీనర్ పురంధర్, వైసిపి నాయకులు ఢిల్లీ, లోకనాథ నాయుడు,హమీద్,శేఖర్, గోపి,రాంబాబు రెడ్డి,వరదరాజులు రెడ్డి, శేఖర్ యాదవ్, ధనశేఖర్ వర్మ, హేమలత, ఎంపీడీవో మోహన్ మురళి, తహసీల్దార్ రవికుమార్,మండలశాఖ నాయకులు పాల్గొన్నారు.



మంత్రిపై పూలవర్షం కురిపిస్తున్న నాయకులు



ఆలయంలో భక్తులకు అన్నదానం చేస్తున్న దాతలు

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి-నగరి : మండలంలోని బుగ్గ అగ్రహారంలో టీటీడీ అనుబంధంలో ఉన్న అన్నపూర్ణాసమేత కాశీవిశ్వేశ్వర ఆలయంలో సోమవారం దాతలు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయానికి దర్శనానికి విచ్చేసిన భక్తులకు ఎం.కొత్తూరు గ్రామానికి చెందిన శంకర అనే దాత అన్నదానం చేశారు. ఆలయంలో అన్నదానం చేయదలచిన వారు ముందురోజు పేరు నమోదు చేసుకోవాలని టెంపుల్ ఇన్స్పెక్టర్ గుణశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి -కార్వేటినగరం : మండలంలోని ఆర్కేవిబి పేట గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు ఎం కిరణ్ కుమార్, దేవి దంపతుల కుమార్తె ఎం హేమ ప్రియదర్శిని 13వ జన్మదిన సందర్భంగా సోమవారం కేక్ కట్ చేసి రాస్ వృద్ధాశ్రమంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వృద్ధులకు అన్నదానం, స్వీట్, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్ మురళి,నాగేంద్ర రాజు,పొన్నురంగం, బాబు, చలపతి, పయణి, కోటి, శీను, అనిల్, వినోద్, రాస్ కోర్డినేటర్ ప్రకాష్, వృద్ధులు పాల్గొన్నారు.

విఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలి: ఎంపిపి

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: విఆర్వోలు ప్రజలకు అందుబాటులో వుండాలని ఎంపిపి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి రెడ్డెప్ప అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రెవిన్యూ శాఖ పై సమీక్షించారు. విఆర్వో లు ప్రజలకు అందుబాటులో ఉండాలని, సమస్యలు పై కాలయాపన చేయొద్దని దిశానిర్దేశం చేశారు. ఇంటి పట్టాలు కోసం స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని,రేషన్ కార్డు సమస్యలు, కొత్త రేషన్ కార్డులు మా వద్ద తెలపాలని తహశీల్దార్ కుమారస్వామి పేర్కొన్నారు. అలపల్లి విఆర్ఓ సమస్యల పరిష్కారం కోసం డబ్బులు డిమాండ్ చేస్తున్నారని అలపల్లి సర్పంచ్ రమణారెడ్డి పిర్యాదు చేసారు. దీనితో విఆర్వో తీరుపై తహసీల్దార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. వి.ఆర్వో లు 3 నుండి5 గంటలు సచివాలయంలో ఉండాలని,గతంలో చెప్పిన మీరు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎం.పి.పి.రెడ్డెప్ప అసహనం వ్యక్తం చేశారు. ఆర్.బి.కె. సిబ్బంది ఎరువులు అమ్మిన వెంటనే డి.డి.కట్టాలని ,అవకతవకలు కు పాల్పడితే జీతాలు నిలిపివేస్తామని ఎం.పి.పి.రెడ్డెప్ప హెచ్చరించారు. మండలంలో 375 మెట్రిక్ టన్నులు యూరియా అమ్మకం చేపట్టింది అని మండల వ్యవసాయక అధికారి గీతకుమారి తెలిపారు.మండలంలో ఖరీఫ్ సీజన్లో సాధారణ వర్షపాతం కన్నా 40 శాతం తక్కువగా వర్షం కురిసింది అని వ్యవసాయ అధికారిణి పేర్కొన్నారు . టమోటా పంట కోసం మొక్కలను 20 పైసలకి పంపిణీ చేస్తామని, సాగుపై 50 శాతం సబ్సిడీ ఉంటుందని ఉద్యనశాఖ అధికారిణి ప్రసన్నలక్ష్మి తెలిపారు .రైతులు తమశాఖ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.గొర్రెలు,మేకలు ఉన్న వారికి టీకాలు అందుబాటులో ఉన్నాయి అని పశువైద్యాధికారి వెంకటసాయి పేర్కొన్నారు.



సర్వసభ సమావేశం నిర్వహిస్తున్న ఎంపిపి

పశువులకు కావాల్సిన మందులు బయట తీసుకొని రావాలని పశు వైద్యాధికారి చీటీలు వ్రాయిస్తున్నారని ఇకమీదట అలాచేస్తే సహించం అని ఎంపిపి మండిపడ్డారు. మండలం లో 73 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని వీటిలో 22 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతోంది అని ఐసిడిఎస్ అధికారి పేర్కొన్నారు. మండలంలోని మిట్టకురపల్లి అంగన్వాడీ కేంద్ర భవనం చుట్టూఉన్న పేడ డిబ్బలు వెంటనే తొలగించడానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఎంపిపి రెడ్డెప్ప ఆదేశించారు. పసిబిడ్డల ప్రాణాలతో చెలగాటం వద్దని హెచ్చరించారు.బైరెడ్డిపల్లి లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంత్రి రామచంద్రారెడ్డి తో ప్రారంభించడం హర్షణీయం అని ప్రజల చిరకాల కోరిక అయిన 24 గంటలు వైద్య సౌకర్యం కల్పించడం కు కృషి చేసిన మొగశాల బ్రదర్స్ ను ప్రజాప్రతినిధులు అభినందించారు. మండలంలో 17 సచివాలయంలలో జగన్ సురక్ష కార్యక్రమం కొనసాగుతోందని వైద్యులు తెలిపారు. అత్యవసర సమయాల్లో 108 వాహనమే కాదు 102 వాహనం కూడా వాడుకోవచ్చని సంభదిత శాఖ అధికారులు తెలిపారు. మిగిలిన శాఖల అభివృద్ధి పై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు,ఎం.పి.టి.సి.లు ఎం.పి.డి.ఓ. రాజేంద్ర బాలాజీ,తహశీల్దార్ కుమారస్వామి,అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేస్తున్న టిడిపి నాయకులు

నారా బ్రాహ్మణికి మద్దతుగా నిరాహార దీక్ష

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా గాంధీ జయంతిని పురస్కరించుకుని నారా బ్రాహ్మణి భువనేశ్వరి నిరాహార దీక్షకు మద్దతుగా సోమవారం మాజీ ఎంపీపీ సుచిత్ర నిరాహార దీక్ష మండల కేంద్రంలో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పై అక్రమ కేసులు బనాయించి తెలుగుదేశం కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. అనంతరం సాయంత్రం మండల టిడిపి అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు ఆమెకి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ జై చంద్ర నాయుడు, మాజీ సింగల్ విండో అధ్యక్షులు హేమచంద్ర నాయుడు, సర్పంచ్ కోకా ప్రకాష్ నాయుడు, మాజీ సర్పంచ్ కమలనాథరెడ్డి, కోడి చంద్రయ్య, వాణిజ్య విభాగ అధ్యక్షులు వంశీ చౌదరి , నాయకులు ధరణి జనార్దన్ గౌడు, నాగరాజు, గౌడ్ రాధాకృష్ణ, శివ సూరి, శాంతమూర్తి, పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు : చిత్తూరు జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ కుటుంబ సభ్యులు బాబుకు బాసటగా మేముంటాం అంటూ నినాదాలు చేశారు. సోమవారం శ్రీధర్ యాదవ్ తన కుటుంబ సభ్యులతో పాటు కొందరు మండలంలోని టిడిపి నాయకులు కొద్దిసేపు విద్యుత్ సరఫరా నిలిపివేసి కొవ్వొత్తులతో నిరసన తెలిపి బాబుకు తోడుగా మేముంటాం అంటూ నినాదాలు చేసి బాబుకు బాసటగా నిలిచారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక స్థానాలు సాధించి చంద్రబాబు నాయుడు మరో పర్యాయం ముఖ్యమంత్రి కావడం ఖాయమని టిడిపి బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమని శ్రీధర్ యాదవ్ అన్నారు.

శాంతియుతంగా రిలే దీక్ష

ప్రజాశక్తి -పలమనేరు : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి ఇచ్చిన పిలుపు మేరకు చంద్రబాబు ఒకరోజు దీక్షకు సంఘీభావంగా పలమనేరు నియోజకవర్గంలో మాజీ మంత్రి ఎన్. అమరనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిరాహార దీక్ష చేపట్టారు . మొదట పలమనేరు టిడిపి కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా మదనపల్లి రహదారిలోని రఘు వీరారెడ్డి కాలనీ సమీపంలో ఏర్పాటు చేసిన దీక్ష శిబిరానికి చేరుకున్నారు. అనంతరం గాంధీ జయంతి సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూజలు చేపట్టి మేము సైతం బాబుకి తోడుగా అని నినదిస్తూ సంతకాల సేకరణను ప్రారంభించి శాంతియుత రిలే దీక్షకు నిర్వహించారు. ఈ దీక్షకు పలమనేరు బార్ అసోసియేషన్, జనసైనికులు తమ మద్దతు తెలిపారు. గంగవరం మండలం పత్తికొండకు చెందిన లక్ష్మీపతి, ప్రవీణ్ అనే యువకులు చంద్రబాబువెంటనే విడుదల కావాలని కోరుతూ తిరుమలకు కాలినడకన వెళ్లే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలమనేరు నియోజకవర్గ జనసేన నాయకులు తమ మద్దతు తెలిపారు. మాజీ మంత్రి వారిని సాధారంగా ఆహ్వానించి సంఘీభావం తెలిపినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో బైరెడ్డిపల్లి, వి.కోట, గంగవరం, , పెద్దపంజాణి,



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అమరనాథరెడ్డి

పలమనేరు పట్టణ, మండలాల పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ, రంగనాథ్, సోమశేఖర్, ఆనంద్, ఆర్ బి సి కు ట్టీ, నాగరాజు రెడ్డితో పాటు సుబ్రహ్మణ్యం గౌడ్, చాంద్ భాష, గిరిబాబు, నాగరాజు, చౌడప్ప, జగదీష్ నాయుడు, శ్రీధర్ మహిళా నాయకురాళ్లు శివకుమారి,ప్రమీల మరియు తెలుగుదేశం పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకులు తో పాటు పలమనేరు నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆస్తి విషయంలో ఘర్షణ

న్యాయవాదికి గాయాలు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : ఆస్తి విషయమై జరిగిన గొడవలో చిత్తూరు నగరానికి చెందిన ప్రముఖ న్యాయవాది వి చంద్రమౌళికి గాయాలయ్యాయి. ఈ సంఘటన చిత్తూరు నగరంలోని రామ్ నగర్ కాలనీలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రాంనగర్ కాలనీకి చెందిన చంద్రమౌళి, కవిత భార్యాభర్తలు. ఇరువురు చిత్తూరు కోర్టులో న్యాయవాద వృత్తి నిర్వహిస్తున్నారు. అయితే వారిరువురి మధ్య బేధాభిప్రాయాలు ఉన్నాయి. అయితే ఏడేళ్ల క్రితం రాంనగర్ కాలనీలోని తమ భవనంకు సంబంధించి భార్యాభర్తలు చంద్రమౌళి, కవితల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత భవనం విషయంగా కోర్టులో వ్యవహారం నడుస్తోంది. అయితే సంబంధిత వివాదాస్పద భవనలోని కింద అంతస్తును వేరొకరికి అద్దెకు ఇచ్చారు. అద్దెకు తీసుకున్న వ్యక్తులు వస్తున్న విషయాన్ని తెలుసుకున్న చంద్రమౌళి సతీమణి కవిత భవనం వద్దకు వచ్చి భర్తతో గొడవ పెట్టుకుంది. ఈ క్రమంలో కవిత, ఆమె అన్న తులసి, ఆయన కుమారుడు జ్యోతిశ్వర్ తదితరులు చంద్రమౌళిపై దాడి చేశారు. ఈ దాడిలో చంద్రమౌళి ఎడమ చెవి వెనుక భాగం, ఎడమ మోచేయి, గొంతు, ఉదరం పైన గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరు వర్గాలను గొడవల నుంచి తప్పించారు. ఈ సందర్భంగా న్యాయవాది చంద్రమౌళి మాట్లాడుతూ తన భార్య కవిత ప్రేరేపణతో పిల్లలు లేని తమ ఆస్తిని కొట్టేయాలని తన భార్య అన్న తులసి, ఆయన కుమారుడు జ్యోతిశ్వర్, అతని స్నేహితుడుతో పాటు మరి కొంతమంది తనపై దాడి చేసి గాయాలు చేశారని తెలిపారు. అనంతరం చంద్రమౌళి చిత్తూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

సోమల ఏఎస్ఐగా దామోదరం



ప్రజాశక్తి -సోమల: సోమల పోలీస్ స్టేషన్ ఏఎస్ఐగా దామోదరం సోమవారం బాధ్యతలు స్వీకరిం చారు. ఈయన చిత్తూర్ వి ఆర్ నుండి బదిలీపై సోమల ఏఎస్ఐ గా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ లక్ష్యంగా బాధ్యతలు నిర్వహిస్తానని ఆయన తెలిపారు.

నేడు జగనన్న సురక్ష : ఎంపిడిఓ


ప్రజాశక్తి -బంగారుపాళ్యం: జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం జరుగుతుందని ఇన్చార్జి ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం మండలంలోని తంబుగానిపల్లి సచివాలయం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఇప్పటికే గ్రామంలో గడపగడపకు సర్వే చేపట్టి అనారోగ్యంగా ఉండే వారిని గుర్తించామని వారికి ఉచితంగా అన్ని పరీక్షలు చేపట్టి, తగిన మందులు పంపిణీ చేపడుతున్నట్టు ఆయన తెలిపారు గ్రామస్తులు ఈ కార్యక్రమం ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.



సభకు హాజరైన ఉపాధి హామీ సిబ్బంది

ఉపాధి సిబ్బంది గ్రామసభ

ప్రజాశక్తి -సోమల: మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని మండలంలోని ఉపాధి హామీ పథకం సిబ్బంది పలుచోట్ల గ్రామ సభలను నిర్వహించి ఉపాధి హామీ 2024- 2025 ఆర్థిక సంవత్సరానికి చేపట్టవలసిన కార్యక్రమాలపై గ్రామ సభలో ప్రజలకు తెలిపారు. నంజంపేట సచివాలయం నందు నిర్వహించిన గ్రామసభలో ఏపీవో దినకర్ మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం ప్రజాప్రతినిధులు మండల స్థాయి అధికారులు ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం పనుల గుర్తింపు కేటాయింపు వుంటుందని మండలంలోని రైతులు కూలీలు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరెడ్డి, కార్యదర్శి సబితా, ఉప సర్పంచ్ ముబారక్, సచివాలయ, ఉపాధి హామీ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.



మంత్రి సమక్షంలో వైసిపి తీర్థం పుచ్చుకున్న మైనార్టీ నాయకులు

మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో మైనార్టీ సోదరులు వైసిపి తీర్థం

ప్రజాశక్తి -చౌడేపల్లి: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో మండలానికి చెందిన మైనార్టీ సోదరులు వైసిపిలో చేరారు. చౌడేపల్లి మండలం 29ఏ చింతమాకులపల్లి పంచాయతీ ఖాన్సాబ్ మిట్టకు చెందిన టిడిపి నాయకుడు నూరుల్లా అతని అనుచరులు కుటుంబ సభ్యులు 30 మందితో తిరుపతిలోని మంత్రి పెద్దిరెడ్డి నివాసంలో ఆయన సమక్షంలో వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ సోదరులకు సముచిత స్థానం కల్పిస్తూ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. గత ప్రభుత్వాలు చేయని విధంగా మైనార్టీల అభివృద్ధికి పలు పథకాలు ప్రవేశపెట్టి ఆ ఫలాలు నేరుగా వారి ఇళ్ళకే చేరే విధంగా కృషి చేస్తున్నామని ఆయన వివరించారు. వైసిపిలో చేరిన వారందరికీ సముచిత స్థానం ఉంటుందని రాబోయే కాలంలో కష్టపడి పనిచేసిన వారికి పార్టీలోనూ ప్రభుత్వంలోనూ పెద్దపీట వేస్తామన్నారు. అంతకు ముందు చౌడేపల్లి నుంచి వచ్చిన అ నాయకులతో ఆయన జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో చౌడేపల్లి వైసిపి అధ్యక్షుడు కూరపర్తి అంజిబాబు, ఎంపీపీ గాజుల రామ్మూర్తి, ఉపాధ్యక్షుడు నరసింహులు యాదవ్, హెచ్డిఎఫ్సి చైర్మన్ కళ్యాణ్ భరత్, మండల సచివాలయాల కన్వీనర్ రుక్మిణమ్మ ,సర్పంచులు శ్రీరామ్ భరత్ వరుణ్, షంషీర్, హైమావతి, రవికుమార్ రెడ్డి, మండల కో ఆప్షన్ నెంబర్ సాదిక్ అజీజుల, రషీదా బేగం, రాధాపతి పాల్గొన్నారు.

ఎస్వీయూలోని అర్థశాస్త్ర కోర్సుతో ఉన్నత అవకాశాలు మెండు : విభాగాధిపతి ఆచార్య ఆర్ సునీత

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని 2023-24 విద్యాసంవత్సరానికి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఏపీ పీజీ సెట్ 2023 లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అర్థశాస్త్రంలో ఉన్నతమైన అవకాశాలు ఉంటాయని విభాగాధిపతి ఆచార్య ఆర్.సునీత పేర్కొన్నారు. సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏపీ పీజీ సెట్ 2023 లో ఆర్థిక శాస్త్రంలో ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో అన్ని రకాల సదుపాయాలతో పాటు మంచి ఉన్నతమైన అవకాశాలు ఉంటాయని వెల్లడించారు. ఎస్వీయూ లోని ఆర్థిక శాస్త్రంలో విభాగానికి ప్రత్యేకంగా గ్రంథాలయం ఉందని , విద్యార్థులకు రెగ్యులర్ కోర్సులో 50 సీట్లు, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులో 45 సీట్లు, సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సులో 40 సీట్లు, మేనేజ్మెంట్ కోటాలో ఐదు సీట్లు ఉంటాయన్నారు. విద్యార్థులకు ప్రత్యేకమైన తరగతి గదులు, డిజిటల్ తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యముతో పాటు పోటీ పరీక్షలకు ప్రత్యేకమైన అవగాహన కార్యక్రమాలు, సదస్సులు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన గ్రంథాలయంలో ఆర్థిక శాస్త్ర విభాగానికి ప్రత్యేకమైన అర్థశాస్త్ర పుస్తకాలు ఉన్నాయన్నారు. దేశవ్యాప్తంగా నిర్వహించే యుజిసి నెట్, రాష్ట్ర స్థాయిలోనే స్లేట్, సివిల్ సర్వీస్ పరీక్షలు ఐఆర్ఎస్, ఐఎఎస్, ఐపీఎస్, ఆర్బిఐ, నాబార్డ్ వంటి సంస్థలలోని వివిధ ఉద్యోగాలకు ఆర్థిక శాస్త్రమే కొలమానం, ప్రామాణికం అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో నిర్వహించే గ్రూప్ 1 నోటిఫికేషన్ లలో కానీ, గ్రూప్ 2, గ్రూప్ 3, సచివాలయం ఉద్యోగాలు, ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్, ఇతర పోటీ పరీక్షలలో ఆర్థిక శాస్త్రం ప్రధాన భాగంగా ఉంటుందని వివరించారు. ఆర్థిక శాస్త్రంలో పీజీ కోర్సు చేసిన తర్వాత విద్యార్థులకు ఇంజినీరింగ్, పీజీ, డిగ్రీ, ఇంటర్, న్యాయవిద్య కళాశాలలో ఆర్థిక శాస్త్రం బోధించడానికి మంచి అవకాశాలుం టాయన్నారు. ఒక్క ఎంబిబిఎస్ కోర్సులో తప్ప మిగిలిన అన్ని కోర్సులలో ఉదాహరణకు ఇంజినీరింగ్, ఎంబీఏ, అగ్రికల్చర్, వెటర్నరీ వంటి పలు కోర్సులలో కూడా ఆర్థిక శాస్త్రం ఒక సబ్జెక్టుగా ఉంటుందన్నారు. విదేశాలలో కూడా ఎన్నో విశ్వవిద్యాలయాలు ఆర్థిక శాస్త్రం పీజీ చేసిన విద్యార్థులకు ఎన్నో ఉన్నతమైన అవకాశాలను కల్పిస్తున్నాయన్నారు. విద్యార్థులు యూనివర్సిటీలోని అన్ని రకాల సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించు కునేందుకు ఆర్థిక శాస్త్రం కోర్సుతో మంచి అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ పీజీ సెట్ 2023 పరీక్షలో రాసి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఎస్వీయూలోనే ఆర్థిక శాస్త్రంలో చేరేందుకు మంచి అవకాశం ఉందని, అవకాశాల్ని సద్విని యోగం చేసుకోవాలని సూచిం చారు. ప్రతి సెమిస్టర్ లోనూ విద్యార్థులకు అవగాహన తరగతులతో పాటు, దేశంలోని వివిధ విశ్వవి ద్యాలయాల్లో బ్యాంకింగ్ రంగంలో, ఆర్థిక శాస్త్ర రంగంలో నిష్ణాతులైన అధ్యాపకులు, ఆచార్యులు, పరిశోధ కులు, రచయితలచే ప్రత్యేక మైన తరగతులు, సదస్సులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగు తుందన్నారు. విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమైన విశ్లేషణాత్మకమైన ప్రశ్నలు, వాటికి సంబంధించిన జవాబులతో పాటు వివిధ కోచింగ్ సెంటర్లు అందించే మెటీరియల్ కు సంబంధించి అంశాల పై విశ్లేషణ, చర్చలు విద్యార్థులకు అందిస్తారన్నారు. ఎస్వీయులోని ఆర్థిక శాస్త్ర విభాగంలో పీజీ కోర్సు చేసిన విద్యార్థులకు రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా ఎక్కడైనా ఉపాధి అవకాశాలు అద్భుతంగా ఉన్నాయని సూచించారు.

